




ఆపదలోనూ స్వాహా..!

కరోనా సాయాన్ని మింగిన ఘనులు
'దుర్గం'లో కర్నూలు ఆడిట్ అధికారుల రహస్య విచారణ

కళ్యాణదుర్గం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కరోనా ఆపద కాలంలోనూ కొందరు ఘనులు కక్కుర్తిపడి పేదల సొమ్మును స్వాహా చేశారు. కరోనా కష్టకాలంలో అప్పటి వైసీపీ ప్రభుత్వం రేషన్‌కార్డు ఉన్న పేదలకు ఇంటికి రూ. వెయ్యి చొప్పున ఆర్థిక సాయం మంజూరు చేసింది. పేదలు నిత్యావసర సరుకులు ఇబ్బందిలేకుండా తీసుకోవాలన్న ఉద్దేశ్యంతో 2020లో ఇచ్చిన ఆ మొత్తాన్ని వారికి పంపిణీ చేయకుండా స్వాహా చేసినట్లు ఇటీవల నిర్వహించిన ఆడిట్‌లో బయటపడింది. కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా కోట్లలోనే డబ్బును నొక్కేసినట్లు సమాచారం. దీనిపై మూడు రోజుల కిందట కళ్యాణదుర్గం ఎంపీడీఓ కార్యాలయంలో కర్నూలు ఆడిట్ అధికారులు రహస్యంగా విచారణ చేపట్టారు. విచారణలో కోట్ల డబ్బుకు సంబంధించి ఏ మాత్రం రికార్డులు లేవని అధికారులు గుర్తించినట్లు సమాచారం. దీంతో వారు కూడా హడావుడిగా ఆడిట్ పూర్తి చేసి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది.

వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులు కలిసి..

అప్పట్లో పనిచేసిన పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు ఇద్దరూ కలిసి ఆ డబ్బులన్నీ తినేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే మంజూరైన డబ్బుకు సంబంధించి కూడా ఎలాంటి రికార్డులు లేవు. ఎవరు పడితే వారు ఇష్టానుసారంగా ఆ డబ్బును దోచేసినట్లు ఆడిట్ అధికారుల విచారణలో స్పష్టం అయ్యింది. అప్పట్లో పనిచేసిన ఏ ఒక్క అధికారి కూడా ఇప్పుడు లేరు. అడిగే వారు లేరన్న ధీమాతో ఆ డబ్బును స్వాహా చేశారు. శెట్టూరులో 13,846 రేషన్‌కార్డులు, కంబదూరులో 16,550 రేషన్‌కార్డులు, కళ్యాణదుర్గంలో 24,950 రేషన్‌కార్డులు, బ్రహ్మసముద్రంలో 13,835 రేషన్‌కార్డులు, కుందుర్పిలో 17,345 రేషన్‌కార్డులు ఉన్నాయి. ఈ రేషన్ కార్డుదారులకు అరకొరగా ప్రభుత్వ సాయాన్ని అందించి, మిగిలినది స్వాహా చేశారనే ప్రచారం జరుగుతోంది.

కనిపించని క్యాష్ బుక్కులు

ప్రభుత్వం మంజూరు చేసిన ఈ డబ్బుకు సంబంధించి పంచాయతీ కార్యదర్శుల దగ్గర క్యాష్ బుక్కులు కనిపించడం లేదు. అప్పట్లో పనిచేసిన పంచాయతీ కార్యదర్శులు కూడా క్యాష్ బుక్కులో కనపరచకుండా అతి తెలివిగా డబ్బును దోచేసుకున్నట్లు తెలిసింది. పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు, వైసీపీ నాయకులు కూడా ఈ సొమ్ము స్వాహాలో భాగస్వాములైనట్లు సమాచారం. అయితే 2020లో జరిగిన అక్రమాలు అన్నీ, ఇప్పుడు పనిచేస్తున్న అధికారులు రికార్డులతో చూపించాలంటే తలకు మించిన భారం అవుతోంది. ఎప్పుడు ఏ అధికారి వచ్చి రికార్డులు చూపించమంటారోనన్న టెన్షన్ అధికారులకు పట్టుకుంది.

ఉన్న రికార్డులను చూపించాం:
ధనుంజయనాథ్, ఎంపీడీవో, కళ్యాణదుర్గం

2020 కరోనా సమయంలో ఒక్కో రేషన్‌కార్డుకు రూ.1000 చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ సొమ్ముకు సంబంధించి మూడు రోజుల కిందట కర్నూలు నుంచి వచ్చిన ఆడిట్ అధికారులు విచారణ చేపట్టారు. కర్నూలు నుంచి వచ్చిన ఆడిట్ అధికారులకు మా దగ్గర ఉన్న రికార్డులను చూపించాం. దాంతో పాటు పంచాయతీ కార్యదర్శులతో కూడా వారు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు.

దశాబ్దాల కల.. నెరవేరిన వేళ..

అనంతపురంరూరల్ మండలంలోని ఎ నారాయణపురం పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ వాసులకు వర్షం వచ్చిందంటే భయం పట్టుకునేది. వంక ఉధృతంగా ప్రవహిస్తే నగరానికి రాకపోకలు నిలిచిపోయేవి. ఊళ్లను చుట్టేసుకుంటూ నగరంలోకి వచ్చేశారు. వంకపై బ్రిడ్జి నిర్మించాలని దశాబ్దాలుగా కోరుతున్నారు. వారి కలను కూటమి ప్రభుత్వం నిజం చేసింది. వంకపై బ్రిడ్జి నిర్మించింది. దాదాపు రూ.4.50 కోట్లతో ఏడాది కిందట చేపట్టిన పనులు పూర్తయ్యాయి. బ్రిడ్జికి ఇరువైపులా సర్వీసు రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. బ్రిడ్జి కిందిభాగంలో చెక్ డ్యాం నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. బ్రిడ్జి నిర్మాణం పూర్తవడంతో ప్రజలకు ప్రయాణ కష్టాలు తప్పినట్లయింది.

-అనంతపురంరూరల్(ఆంధ్రజ్యోతి)


నిర్మాణం పూర్తయిన నారాయణపురం వంతెన

రెక్కల్లో చిక్కిన సూరీడు


మంచు ఆకాశంలో గాలిమర రెక్కల్లో కనిపిస్తున్న భాస్కరుడు

మంచు దుప్పట్లో భానుడు ఉదయిస్తున్నాడు. కమ్మేసిన పొగను చీల్చుకుంటూ వెలుగులు పంచుతున్నాడు. ఇంతలోనే గాలిమరల రెక్కల్లో నక్కి కనువిందు చేశాడు. పొగమంచు మరింత పెరిగింది. సూర్యుడు మరింత తేజోవంతుడయ్యాడు. భానుడిని రెక్కల్లో చిక్కబుచ్చుకున్నాననుకున్న గాలిమర చిన్నబోయింది. మంచులో కనిపించకుండా పోయింది. సూరీడు మాత్రం మరింత కాంతివంతుడయ్యాడు. రెక్కను అడ్డుపెట్టి.. సూర్యుడిని ఆపగలరా.. కూడేరు మండల కేంద్రం సమీపాన ఆదివారం ఉదయాన్నే ఈ దృశ్యాలు కనిపించాయి.

-కూడేరు(ఆంధ్రజ్యోతి)

క్లిక్ చేస్తే..
ఖాతా ఖాళీ..!

- ఏపీకే ఫైల్ టచ్ చేస్తే సెల్‌ఫోన్ హ్యాక్
- బ్యాంకు అకౌంట్లలోని నగదు లూటీ
- మూడు నెలల్లోనే జిల్లాలో 110 కేసులు
- రూ.50 లక్షల మొత్తాన్ని లాగేసిన నేరగాళ్లు



అనంతపురం క్రైం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు వివిధ మార్గాల్లో ప్రజలను చావు దెబ్బ కొడుతున్నారు. సెల్‌ఫోన్‌లకు ఏపీకే ఫైల్స్ పంపి, ఉచ్చు బిగించి లక్షల రూపాయలు కాజేస్తున్నారు. బాధితుల్లో చదువురాని వారితో పాటు ఉద్యోగులు సైతం ఉంటున్నారు. ఇటీవల మూడు నెలల కాలంలో వంద మందికి పైగా కేసులు నమోదు చేశారు. రూ.50 లక్షల వరకూ బాధితులు నష్టపోయారు. ఇవి కేసులు నమోదైన వివరాలు మాత్రమే. అనధికారికంగా, ఫిర్యాదు చేయని వారు అంతా కలిస్తే ఆ సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉంటుంది.

స్మార్ట్‌ఫోన్ వినియోగదారులకు వల...

స్మార్ట్ ఫోన్ వినియోగించేవారే సైబర్ నేరగాళ్లకు ఆదాయవనరు. వారిని టార్గెట్ చేసుకుని మోసగాళ్లు ఏపీకే వల విసురుతున్నారు. స్మార్ట్ ఫోన్లలోని సోషల్ మీడియా మాధ్యమాల్లోకి ఉన్నఫలంగా బూడిద రంగులో ఉండే ఏపీకె ఫైల్స్ వస్తాయి. లేదా ఫలానా బ్యాంకు పేరుతో లేదా, సెల్ నెంబర్ ఒకే సిరీస్ ఉన్న గ్రూప్ అంటూ...ఇలా ఏదో వంకతో వాట్సప్ గ్రూప్ క్రియేట్ చేసి ప్రజలను సభ్యులుగా చేరుస్తారు. ఇందులో ఏపీకే ఫైల్స్‌ను ఉంచేస్తారు. ఇదంతా క్షణాల వ్యవధిలోనే జరిగిపోతుంది. ఇది తెలియని కస్టమర్లు కొత్త గ్రూప్ అనో, ఏదో ఫైల్ వచ్చిందనో....ఏపీకే ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేస్తారు. ఇలా డౌన్‌లోడ్ చేసిన వెంటనే వారి సెల్‌ఫోన్ సైబర్ (మిగతా 7లో...)

సధరం స్లాట్ బుకింగ్..!

- ప్రారంభమైన వైకల్య నిర్ధారణ రిజిస్ట్రేషన్ ప్రక్రియ
- సచివాలయాలు, మీసేవ కేంద్రాల్లో బుకింగ్
- గంటల్లోనే భర్తీ
- డబ్బులిస్తే ఖాళీ చూపిస్తారు..
- దళారుల చేతుల్లోకి స్లాట్‌లు
- చోద్యంచూస్తున్న అధికార యంత్రాంగం
- నేడు స్లాట్ బుకింగ్ ఉంటుందా? లేదా?


స్లాట్ బుకింగ్ కోసం నిరీక్షిస్తున్న బాధితులు

అనంతపురం వైద్యం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులకు వైకల్య ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేసే సదరం అక్రమాల నిలయంగా మారిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సదరం స్లాట్ బుకింగ్‌లో పైసా వసూల్‌కి తెరలేపారు. అన్నీ భర్తీ అయిపోయాయని చెబుతున్నారు. పైసలిస్తే ఖాళీ చూపిస్తుండడం శోచనీయం. పారదర్శకంగా వైకల్యాన్ని ధ్రువీకరించి సర్టిఫికెట్లను జారీచేయడమే సదరం ఉద్దేశం. వైకల్యమున్న వారు ధ్రువీకరణ కోసం వైద్యుడిని సంప్రదించేందుకు సదరం వెబ్‌సైట్‌లో స్లాట్‌ను బుకింగ్ చేసుకోవాలి. శారీక, మానసిక, బధిరులు, దృష్టి ఇలా వైకల్యంవారిగా సదరం వెబ్‌సైట్‌లో స్లాట్‌లను రూపొందించారు. ఆయా వైకల్యమున్న వారు సంబంధిత స్లాట్‌లో డాక్టర్‌ను సంప్రదించడానికి ఆధార్ నంబర్‌తో బుకింగ్ చేసుకుంటారు. ఈ ప్రక్రియనే సదరం స్లాట్ బుకింగ్ అంటారు.

దళారుల చేతుల్లోకి సదరం

వైకల్య నిర్ధారణ రిజిస్ట్రేషన్ ప్రక్రియ అయిన సదరం స్లాట్ బుకింగ్‌ను సచివాలయాలు, మీసేవ కేంద్రాలకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ అప్పగించింది. స్లాట్‌బుకింగ్ ప్రక్రియ ఆరేళ్లుగా దళారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు, మీసేవ కేంద్రాల్లో నిర్వాహకులకు మాత్రమే సదరం స్లాట్‌బుకింగ్ ఐడీ, పాస్‌వర్డ్ ఉంటుంది. ఐడీ, పాస్‌వర్డ్ ఉన్నవారిని బుట్టలోకి వేసుకుని దళారులు దందా నడిపిస్తున్నారు. దీంతో దళారులను ఆశ్రయించి ముడుపులు అప్పగించిన వారికే స్లాట్‌లు బుకింగ్ అవుతున్నాయి. సాధారణ వ్యక్తిగా సచివాలయం, మీసేవ కేంద్రానికెళ్తే.. సర్వర్ ఓపెన్ అవ్వగానే స్లాట్‌లు అన్నీ భర్తీ అయినట్లు చెబుతున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే తమ చేతుల్లో ఏమీలేదనీ, ప్రభుత్వం మళ్లీ ఖాళీలను చూపినపుడు చేస్తామని సమాధానమిస్తున్నారని బాధితులు మండిపడుతున్నారు. సదరం స్లాట్ బుకింగ్ ప్రక్రియను పర్యవేక్షించే యంత్రాంగం నిద్రమత్తులోకి వెళ్లడంతో దళారులు బరితెగించి తమకు అన్యాయం చేస్తున్నారని బాధితవర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

రూ.1500 పైమాటే...

ఒక్కో స్లాట్ బుకింగ్‌కు రూ.1500 నుంచి రూ.3వేల వరకు వసూలు చేస్తున్నారు. ఈ సొమ్మును దళారులు, బుకింగ్ చేసే సిబ్బంది పంచుకుంటున్నారు. పైసలిచ్చుకుంటే (మిగతా 7లో...)

అరటి రైతు అరణ్య రోదన

- పాతాళానికి పడిపోయిన ధర
- పంటను దున్నేస్తున్న అన్నదాతలు
- గెలలను పడేస్తున్న వైనం


రాయలచెరువు వద్ద అరటిపంటను తొలగిస్తున్న రైతు చరణ్

లక్షలు పెట్టుబడులు పెట్టి.. అరటి పెట్టాడు. నెలల పాటు పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నాడు. దిగుబడి బాగా వచ్చింది. కష్టాలు తీరతాయనుకున్నాడు. ధరలు తగ్గిపోయాయి. పాతాళానికి పడిపోయాయి. కొనేవారే లేరు. కాయలన్నీ గెలల్లోనే మాగిపోతున్నాయి. చేసేదిలేక గెలలన్నీ తొలగించి పడేస్తున్నాడు. పశువులు, మేకలకు వదిలేస్తున్నాడు. పంటను దున్నేస్తున్నాడు. లక్షల పెట్టుబడులు, నెలల కష్టం మట్టిలో కలిపేస్తున్నాడు. యాడికి మండలంలోని రాయలచెరువుకు చెందిన రైతు అరటి పంటను ఆదివారం దున్నేశాడు. గెలలను దగ్గరలోని వంకలో పడేశాడు. అరటి గతంలో టన్ను రూ.22 వేల వరకు ధర పలికింది. ప్రస్తుతం రూ.2 వేలకి కూడా అడిగేవారు లేరు. అరటి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

-యాడికి(ఆంధ్రజ్యోతి)


వంకలో పడేసిన గెలలు

గొంతు తడిపిన సత్యసాయి

తాగునీటి పథకానికి రూపకల్పన

- రూ.380 కోట్లతో 2025 కిలో మీటర్ల పైపులైన్ ఏర్పాటు
- 1341 గ్రామాలకు నీటి సరఫరా


సీబీఆర్ నుంచి వస్తున్న నీరు



తాడిమర్రి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు చేయలేని పనిని తాను చేసి చూపించిన అపర భగీరథుడు సత్యసాయిబాబా. ఉమ్మడి జిల్లా ప్రజల దాహార్తిని తీర్చేందుకు 1993లో సత్యసాయి నీటి సరఫరా పనులు ప్రారంభించారు. దీనికి రూ.190 కోట్ల ఖర్చు చేసి 600 గ్రామాలకు తాగునీటిని అందించాలని సంకల్పించారు. ఈ పనులు 1995 సంవత్సరానికి పూర్తి చేసి నవంబరు 23న అప్పట్లోనే వర్చ్యువల్ పద్ధతిలో సత్యసాయిబాబా రిమోట్ కంట్రోల్ ద్వారా సీబీఆర్ వద్ద మోటార్లు ఆన్‌చేసి ప్రారంభించారు. తరువాత 1998లో ఎల్అండ్‌టీకి అప్పగిస్తూ సత్యసాయి బోర్డు తీర్మానించింది. అప్పటి నుంచి వివిధ దశల్లో మొత్తం రూ.380 కోట్లు ఖర్చు చేసి 860 కిలో మీటర్ల మెయిన్ పైపులైన్ ఏర్పాటు చేసి ఉమ్మడి జిల్లాలోని 16 లక్షల 39వేల 943 కుటుంబాలకు శుద్ధజలం సరఫరా చేస్తున్నారు. ఇందులో 558 మంది టెక్నికల్, నాన్‌టెక్నికల్ విభాగాల్లో పనిచేస్తున్నారు. ప్రస్తుతం (మిగతా 7లో...)

అంచనాలకు మించి పరిశ్రమలు...!

- చంద్రబాబు, లోకేశ్ కృషితో ఏపీ వైపు గ్లోబల్ దృష్టి
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

అనంతపురం క్రైం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ కృషి వల్ల అంచనాలకు మించి పరిశ్రమలు వచ్చాయని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజే నాగరాజు, ఏపీ కురుబ సాధికార సమితి సభ్యులు కురుబ నారాయణస్వామితో కలసి ఆయన మీడియా మాట్లాడారు. జగన్ విధ్వంస పాలనలో భయపడి వెనక్కు వెళ్లిన పరిశ్రమలు కూడా నేడు రాష్ట్రానికి వచ్చాయని తెలిపారు. ఇప్పుడు గ్లోబల్ దృష్టి ఏపీ వైపు పడిందన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఏపీని పెట్టుబడుల హబ్‌గా మార్చేందుకు ఎంతగానో శ్రమించారని విశాఖలో జరిగిన సీఐఐ సమ్మిట్ నిరూపించిందన్నారు. ఈ సదస్సులో పెట్టుబడుల యుగానికి నాంది పడటమే కాకుండా ఏపీకి పెట్టుబడులకు గమ్యంగా మార్చిందన్నారు. ఇప్పటి వరకూ ప్రతి రాష్ట్రం 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'ను అనుసరిస్తుంటే... ఏపీ అందుకు భిన్నంగా 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'గా మార్చిందని తెలిపారు. సింగిల్ విండో పాలసీతో పెట్టుబడులకు 21 రోజుల్లోనే అన్ని అనుమతులు వేగంగా ఇస్తూ...పరిశ్రమలను ఆకర్షిస్తోందని అన్నారు. చంద్రబాబు, లోకేశ్ కృషి వల్ల రాయలసీమకు కూడా స్వర్ణ యుగం మొదలైందని ఆనందం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న వెంకటశివుడు యాదవ్

క్రైం కార్నర్

హంద్రీనీవా కాలువలో వైద్యాధికారి గల్లంతు

● గాలిస్తున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది


కార్తీక్ రెడ్డి (ఫైల్)

బెళుగుప్ప/ఆత్మకూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు సమీపంలోని పంపనూరు వద్ద హంద్రీనీవా కాలువలో పడి ఆదివారం ప్రభుత్వ వైద్యాధికారి కార్తీక్‌రెడ్డి గల్లంతయ్యారు. పంపనూరు సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకుని, వన భోజనాలు ముగించుకుని కాలువపై నిర్మించిన బ్రిడ్జి వద్ద ఇంటి పక్కన ఉన్న మరోవ్యక్తితో కలిసి ఈతకు దిగారు. డాక్టర్‌కు ఈత కూడా వచ్చు. నీటి ప్రవాహం ఎక్కువగా వుండడంతో తోడుగా వెళ్లిన వ్యక్తి భయపడి ఒడ్డుకు చేరుకున్నాడు. ప్రవాహం ధాటికి డాక్టర్ కళ్లెదుటే నీటిలో కొట్టుకుపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. బ్రిడ్జి నుంచి పది కిలోమీటర్ల వరకు పోలీసులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. కార్తీక్‌రెడ్డి బెళుగుప్ప మండలం దుద్దేకుంటకు చెందిన వెంకటస్వామిరెడ్డి, శ్రీదేవి అనే రైతు దంపతుల పెద్దకుమారుడు. ప్రస్తుతం బెళుగుప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా పనిచేస్తున్నారు. డాక్టర్ కార్తీక్‌రెడ్డి భార్య శ్రావణి కర్నూలులో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వీరికి ఒక కుమార్తె సంతానం కలదు. భార్య అందుబాటులో లేకపోవడంతో కూతురు, బంధువులతో కలిసి వనభోజనానికి వచ్చారు. నీటిలో పడిన విషయాన్ని బంధువులు స్థానిక పోలీసులుకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు ప్రారంభించారు. పోలీసులతో పాటు అగ్నిమాపకశాఖ సిబ్బంది గాలించారు. కార్తీక్‌రెడ్డి కోసం కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతం ఎదురు చూస్తున్నారు. ఆయన సొంత మండలంలో ప్రజలకు వైద్యసేవలు అందించాలని తపన పడేవారు. ప్రాణంతో తిరిగి వచ్చి వైద్య సేవలు అందించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు గ్రామస్థులు, బెళుగుప్ప ఎంపీపీ పెద్దన్న, టీడీపీ నాయకులు తిమ్మప్ప, పెద్ద తిప్పయ్య, మల్లికార్జున తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కళ్యాణదుర్గం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): భర్త దాడిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మహిళ ఆదివారం మృతి చెందింది. మండల పరిధిలోని బోరంపల్లిలో ఈనెల 12న ఎర్రిస్వామి అనే వ్యక్తి తన భార్య రత్నమ్మ(44)ను గొంతుకోసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అప్పటి నుంచి భార్య రత్నమ్మ అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఈ నెల 14న ఎర్రిస్వామిని మండల పరిధిలోని శీబాయి బస్టాండ్ వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ హరినాథ్ తెలిపారు. ఈ నెల 12న అనుమానంతో దంపతుల మధ్య గొడవ జరిగిందని, ఆవేశానికి గురైన ఎర్రిస్వామి భార్య రత్నమ్మ గొంతు కోశాడని వివరించారు. అనంతరం పరారీ కావడంతో ఎర్రిస్వామిని అరెస్టు చేసి రాయదుర్గం కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి 14 రోజులు రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ పేర్కొన్నారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఇరుపార్టీల నాయకులపై కేసుల నమోదు

హిందూపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం జరిగిన ఘటనలో టీడీపీ, వైసీపీకి చెందిన నాయకులపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ మహేష్ తెలిపారు. శనివారం వైసీపీ ఇన్‌చార్జ్ దీపికా భర్త వేణురెడ్డి ఎమ్మెల్యే బాలకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో టీడీపీకి చెందిన పలువురు ఆయనతో క్షమాపణలు చెప్పించాలని వైసీపీ కార్యాలయానికి వెళ్లారు. ఆ సమయంలో ఆయన లేకపోవడంతో అక్కడే ఉన్న వైసీపీ నాయకులు టీడీపీ కార్యకర్తలపై తిరగబడ్డారు. దీంతో ఆగ్రహించిన టీడీపీ కార్యకర్తలు కార్యాలయంలోని ఫర్నీచర్‌ని ధ్వంసం చేశారు. దీంతో వైసీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. టీడీపీ పట్టణ కన్వీనర్ వెంకటేష్, మండల కన్వీనర్ హెచ్‌ఎన్ రాము, లేపాక్షి మండల కన్వీనర్ అభిలాష్, యుగంధర్, రోడ్డు కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రమోహన్ యాదవ్, బాబురెడ్డి, ఇందాద్, ప్రవీణ్, అంజి, బాజిల్, బాబు, ఇదాయ్, అమాన్, జబీలతో పాటు మరో 40 మందిపై కేసునమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిన దీపికా భర్త వేణురెడ్డి, వాల్మీకి లోకేశ్, దివాకర్, వాసీం, నవీన్, మనోజ్ గౌడ్, ఇర్షాన్‌తో పాటు మరో 15 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కార్యవర్గం ఎంపిక


కార్యవర్గానికి నియామక పత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్వరరావు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో రాష్ట్ర నాయకులు మల్లేశ్వరరావు, మద్దిలేటి, సుబ్రహ్మణ్యం, కె. రమణ పర్యవేక్షణలో జిల్లా కమిటీని ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా టి. చెన్నప్ప, సహాధ్యక్షుడిగా పి. వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్రీహరి, నాగరాజు, కార్యదర్శిగా పెద్ద రెడ్డప్ప, సంయుక్త కార్యదర్శులుగా రాధమ్మ, వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శిగా ఫక్కీరప్ప, కోశాధికారిగా జాఫర్‌ను ఎంపిక చేశారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు.

నూతన కార్యవర్గం..


పశుసంవర్ధక శాఖ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం

అనంతపురం అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా పశుసంవర్ధక శాఖ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక సాయినగర్‌లోని వెటర్నరీ ఆస్పత్రిలో ఆ సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమ సమస్యలపై సంఘం తరఫున చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం ఉమ్మడి అనంత జిల్లా అధ్యక్షుడిగా మహేంద్ర ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా బాబునాయుడు, ఉపాధ్యక్షులుగా వరప్రసాద్, సురేష్ బాబు, సహాయ కార్యదర్శులుగా రామాంజనేయులు, ఆదినారాయణ, కోశాధికారిగా విశ్వనాథ్, ఈసీ సభ్యులుగా నాగపవన్, ఆదినారాయణ, రేవతి, నరసింహులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం సభ్యులకు పలువురు సంఘం సభ్యులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

సహకార ఉద్యోగుల సంఘం..


మల్లరాయుడు, కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ సహకార ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా బి. మల్లరాయుడును ఎన్నుకున్నారు. సహకార ఉద్యోగుల జిల్లా కమిటీ ఎన్నికలు ఆదివారం స్థానిక సుభాష్‌రోడ్డులోని ఎన్టీఆర్ సహకారభవన్ ప్రాంగణంలో నిర్వహించారు. సీనియర్ ఇన్‌స్పెక్టర్ లీలావతి, సహకార ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగంగాధర్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ సజావుగా జరిగింది. వెంటనే ఓట్ల లెక్కింపు, ఫలితాలను ప్రకటించారు. ప్రభుత్వ సహకార ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా బి. మల్లరాయుడు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సృజన్, ఉపాధ్యక్షుడిగా వైఎండీ ఇస్మాయిల్, కార్యదర్శిగా కుమార్, సహాయ కార్యదర్శులుగా రమేష్‌బాబు, రమణమాధవి, కోశాధికారి వెంకటేశ్వర్లు, కార్యవర్గసభ్యులుగా నరసింహమూర్తి, లతీఫ్ ఎన్నికయ్యారు.

గొంతు తడిపిన సత్యసాయి

(5వ పేజీ తరువాయి)

274 ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు, 165 రిజర్వాయర్‌లలో 66 పంప్ స్టేషన్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, పీఏబీఆర్ డ్యాం, పెన్నా, హెచ్‌ఎల్‌సీ, టీజీబీసీ, మిడ్‌పెన్నార్ కాలువ ద్వారా నీటిని సమీకరించుకుని ఐదు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులలో నీటిని నిల్వ ఉంచి నిరంతరం సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ తాగునీటి పథకాలు లేని గ్రామాలకు కూడా సరఫరా చేసి ప్రజల దాహార్తిని తీర్చి సత్యసాయి బాబా ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయారు.



ఎక్కడెక్కడ ఫిల్టర్ పాయింట్లు ఉన్నాయంటే..

పెద్దకోట్ల వద్ద రెండు ఫిల్టర్ పాయింట్లు ఉన్నాయి. వీటిలో రోజుకు 2.01 కోట్ల లీటర్లనీటిని ఫిల్టర్ చేసి తాడిమర్రి పంప్‌హౌస్‌కు పంపుతారు. వాటిని తాడిమర్రి, బత్తలపల్లి, ధర్మవరంరూరల్, కొత్తచెరువు, పుట్టపర్తి మండలాలకు సరఫరా చేస్తారు. అలాగే కదిరికి చిన్నకోట్ల వద్దగల వాటర్ స్కీం ద్వారా, కళ్యాణదుర్గం, ఆత్మకూరు మండలాలకు పీఏబీఆర్ ద్వారా, నార్పల, చుట్టు పక్కల గ్రామాలకు బి.పప్పూరు పాయింట్ నుంచి పంపిస్తారు. బుక్కరాయసముద్రం మండలానికి అక్కడే నీటిని ఫిల్టర్ చేసి పంపుతారు. కొనకొండ్ల, రాయలచెరువు, గార్లదిన్నె, కల్లూరు, గుత్తి, గుడిసెలపల్లి, పెద్దపప్పూరు, గడేకల్లు, తీటకల్లు, సజ్జలదిన్నె, కొండూరు, రావిలవెంకటాంపల్లి వద్దగల రెండు నీటి సరఫరా పథకాల ద్వారా నిత్యం 1341 గ్రామాల్లోని 16,39,983 కుటుంబాలకు 5.82 కోట్ల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు.

స్వచ్ఛమైన నీరు తాగుతున్నాం



సత్యసాయి బాబా ఏర్పాటు చేసిన నీటి సరఫరా వల్ల స్వచ్ఛమైన నీటిని తాగుతున్నాం. తాగునీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్న సమయంలో బాబా స్పందించి నీటి సరఫరా చేసి మా అందరికి దేవుడుగా మారాడు. ఆ నీరు లేకపోతే మాకు తాగునీరే లేదు.

-శ్రీనివాసరెడ్డి, కునుకుంట

అప్పుడు తోటనీరే గతి



బాబా లేకుంటే మాకు తోట నీరే గతి అయ్యేది. సత్యసాయి తాగునీరు లేకపో తే మాకు తోటల వద్ద నీరు తప్ప మరో మార్గం లేదు. మా గ్రామం చుట్టూ ఉన్న రైతులు వారి ఇళ్లకు తోటల వద్ద నుంచి పైపులైన్ వేసుకుని నీటి అవసరం తీర్చుకునేవారు. సత్యసాయినీరు వచ్చిన తరువాత అందరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా జరుగుతోంది.

-నాగేంద్ర, మద్దెలచెరువు

దిగుడుబావే దిక్కు



గతంలో మా గ్రామంలో తాగునీటి కోసం దిగుడుబావి, చేతిబోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకునే వాళ్లం. ఇంట్లో ఒకరికి పనులు మానేసి నీటి కోసం సమయమంతా సరిపోయేది. సత్యసాయిబాబా పుణ్యమా అని మా గ్రామంలో ట్యాంకులు, వీధివీధికి కొళాయిలు వేయడంతో తాగునీటి సమస్య తీరింది. దాంతో పాటు ఫ్లోరైడ్ సమస్య తీరింది.

-హేమాదేవి, గాండ్లవారిపల్లి, ముదిగుబ్బ మండలం

క్లిక్ చేస్తే ఖాతా ఖాళీ..!

(5వ పేజీ తరువాయి)

నేరగాళ్ల నియంత్రణలోకి వెళ్లిపోతుంది. దీంతో కస్టమర్ల బ్యాంక్ ఖాతాలు, మెయిల్స్, మెసేజ్‌లు అన్నీ హ్యాక్ చేసి బ్యాంకు ఖా తాలోని డబ్బులను దోచేస్తారు. ఇలా మోసపోయే బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఆండ్రాయిడ్ ప్యాకేజ్ కిట్. దీన్నే సంక్షిప్తంగా ఏపీకే ఫైల్. ఆండ్రాయిడ్ ఫోన్లలో యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేసుకోడానికి ఉపయోగించే ఈ ఫైల్ ఫార్మాట్‌ను ఆధారంగా చేసుకుని నేరగాళ్ల నకిలీ ఏపీకే ఫైల్స్ ద్వారా సెల్‌ఫోన్లు హ్యాక్ చేసే మాల్వేర్‌తో మన సెల్‌ఫోన్లలోకి చొరబడి దోచేస్తున్నారు.

రూ. 50 లక్షల పైనే...

జిల్లా వ్యాప్తంగా బాధితులు ఇచ్చిన ఫిర్యాదుల వల్ల ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో 110 కేసులు నమోదయ్యాయి. వీళ్లలో చదువుకున్న యువత, ఉద్యోగుల నుంచి, అక్షర జ్ఞానం లేని పల్లె ప్రజలు కూడా ఉన్నారు. ఫిర్యాదు చేయని బాధితులు చాలా మందే ఉన్నారు. ఇప్పటి వరకూ ఈ మూడు నెలల్లో 110 మంది బాధితులు రూ.50లక్షలపైనే పోగొట్టుకున్నట్లు తెలిసింది. కాగా సుమారు 54 మంది బాధితుల సెల్‌ఫోన్ల నుంచిచీ మాల్వేర్‌ను తొలగించి, వారి మెయిల్స్, వాట్సాప్స్, ఇతర డేటా రికవరీకి పోలీసులు సాయం చేశారు. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొత్త గ్రూపుల్లో చేరే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

అప్రమత్తతే రక్షణ...

సైబర్ నేరగాళ్లు ఢిల్లీ, బిహార్, పంజాబ్, హరియాణా వంటి ఇతర రాష్ట్రాల నుంచే కాకుండా హాంకాంగ్, జింబాంబ్వే, కెన్యా ఇలా ఎక్కడి నుంచి అయినా... సెల్‌ఫోన్లలోకి మాల్వేర్‌ను చొప్పించే ప్రమాదం ఉంది. ఏపీకే ఫైల్స్ ద్వారా మాల్వేర్‌తో ఎంట్రీ ఇచ్చి మనకు సంబంధించిన డేటాతోపాటు, మన బ్యాంకుల్లో డబ్బును దోచేయవచ్చు. వీళ్ల చేతికి చిక్కకుండా ఉండాలంటే నిత్యం అప్రమత్తంగా ఉండాలి. మనకు సంబంధం లేని వ్యక్తుల నుంచీ ఏపీకే ఫైల్స్ వచ్చినా.... వాటిని డౌన్‌లోడ్ చేయరాదు. అదేవిధంగా అపరిచితులు యాడ్ చేసే గ్రూప్స్‌లో సైతం ఉండకూడదు. ఓటీపీలు అసలే చెప్పరాదు.

ఏపీకే ఫైల్స్ క్లిక్ చేయరాదు



ప్రజలకు అవసరం లేని, అనవసరమైన ఏపీకే ఫైల్స్ క్లిక్ చేయరాదు. ప్రజలకు తెలిసిన వ్యక్తుల నుంచి వచ్చినా, తెలియని వ్యక్తుల నుంచి వచ్చినా అవసరమైన సమాచారం ఉన్న ఫైల్స్ మాత్రమే క్లిక్ చేయాలి. ముఖ్యంగా అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఏపీకే ఫైల్స్ డౌన్‌లోడ్ చేయరాదు. అవగాహనతో ఉండాలి. ఇదే ప్రజలకు సైబర్ నేరగాళ్ల నుంచి రక్షణ.

-జగదీష్, ఎస్పీ, అనంతపురం

23న కళ్యాణదుర్గంలో సైన్స్ సంబరాలు

- జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరరాజు

అనంతపురం టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈనెల 23న కళ్యాణదుర్గంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్లు జేవీవీ జిల్లా కార్యదర్శి వీరరాజు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జేవీవీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కేపీ చిత్తప్ప అధ్యక్షతన నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మొత్తం 44 జట్లు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నాయని తెలిపారు. ప్రతి జట్టులో 8, 9, 10వ తరగతికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఉంటారని, వారంతా ఇప్పటికే పాఠశాల, మండల స్థాయిల్లో మొదటి స్థానంలో ఎంపికయ్యారని వివరించారు. జిల్లా స్థాయిలో జరిగే పోటీలలో గెలుపొందే ఒక ప్రభుత్వ పాఠశాల జట్టు, మరో ప్రైవేట్ పాఠశాలల నుంచి మరో జట్టును రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలకు ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు ముక్కర రామిరెడ్డి, నాయకులు గాంగేనాయక్, ప్రసాద్, లక్ష్మీనారాయణ, నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.40



అనంతపురం రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో ఆదివారం టామోటాలు కిలో గరిష్ఠంగా రూ.40తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.24తో, సరసరిగా రూ.30తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1800 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

పశువుల సంత ఆదాయం రూ.3.43 లక్షలు

అనంతపురంరూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్లో జరిగిన పశులసంతవల్ల మార్కెట్‌కు రూ.3.43 లక్షల ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి రాఘవేంద్రకుమార్ ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.2.07 లక్షలు, ఆదివారం ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1.36 లక్షల ఆదాయం వచ్చినట్లు చెప్పారు.

పురంలో హైటెన్షన్

● ఓవైపు బాలయ్య పర్యటన..

మరోవైపు వైసీపీ నాయకుల కవ్వింపు చర్యలు

● పోలీసులకు ముచ్చెమటలు


పోలీసులతో అనంత వెంకటరామిరెడ్డి వాగ్వాదం

హిందూపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణపై వైసీపీ ఇన్‌చార్జి దీపిక భర్త వేణురెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం, అందుకు నరిసనగా.. వైసీపీ కార్యాలయంలోని ఫర్నీచర్‌ను టీడీపీ శ్రేణులు ధ్వంసం చేయడంతో పట్టణంలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ఆదివారం ఉదయం ఉమ్మడి జిల్లాకు చెందిన వైసీపీ ముఖ్యనేతలు.. హిందూపురానికి రావడానికి ప్రయత్నించారు. వారిని ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకున్నారు. కడప నుంచి వస్తున్న సతీష్‌రెడ్డిని కదిరి వద్దే పోలీసులు అడ్డుకుని హౌస్ అరెస్టు చేశారు. కదిరి మగ్బూల్‌ను లేపాక్షిలో అడ్డుకుని వెనక్కు మళ్లించారు. వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని హిందూపురం మండల కొల్లకుంట వద్ద అడ్డుకున్నారు. దీంతో వారు రోడ్డుపై బైఠాయించారు. ఎట్టకేలకు వారిని హిందూపురానికి రాకుండా పోలీసులు వెనక్కు పంపించేశారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు రెచ్చిపోయి మాట్లాడారు. మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ వస్తుండగా అడ్డుకున్నారు. మరో మాజీ ఎంపీ రంగయ్య హిందూపురానికి చేరుకుని, వైసీపీ కార్యాలయాన్ని పరిశీలించారు. ఆ పార్టీ పరిశీలకుడు రమేష్‌రెడ్డి హిందూపురానికి చేరుకుని పగిలిన కార్యాలయం అద్దాలను పరిశీలించారు.


ఉషశ్రీని అడ్డుకుంటున్న పోలీసులు

ఏం జరుగుతుందోనని..

హిందూపురంలో ఓవైపు బాలకృష్ణ పర్యటన కొనసాగుతుండగా.. మరోవైపు ఉమ్మడి జిల్లా వైసీపీ నేతలు వస్తున్నారన్న సమాచారంతో పోలీసులకు చెమటలు పట్టాయి. వైసీపీ నేతలు.. పార్టీ కార్యాలయాన్ని సందర్శించి, అక్కడి నుంచి అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలపాలని నిర్ణయించుకున్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణపై ఇప్పటివరకు వైసీపీ నాయకులు విమర్శలు చేసినా, అవాకులు చవాకులు పేల్చినా.. ఊరుకున్నారు. శనివారం దీపిక భర్త వేణు చేసిన అనుచిత వ్యాఖ్యలకు బాలకృష్ణ తనదైన శైలిలో హెచ్చరించినట్లు తెలిసింది. దీంతో తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్నడూలేని విధంగా వైసీపీ కార్యాలయంపై దాడి చేశారు. ఎమ్మెల్యే స్థానికంగా ఉండటంతో ఎప్పుడేం జరుగుతుందోనని పోలీసుల్లో హైటెన్షన్ నెలకొంది. ఈ పరిస్థితుల్లో వైసీపీ నాయకులను ఎక్కడికక్కడే అడ్డుకోవడంతో బాలకృష్ణ పర్యటన ప్రశాంతంగా ముగిసింది. దీంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

తిమ్మమ్మ మర్రిమానును సందర్శించిన న్యాయాధికారులు


తిమ్మమ్మ మర్రిమాను వద్ద మర్రి ఊడలను పరిశీలిస్తున్న న్యాయాధికారులు

నంబులపూలకుంట/గాండ్లపెంట, నవంబరు16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూటిబైలులో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిమ్మమర్రిమానును జిల్లా న్యాయాధికారులు ఆదివారం సందర్శించారు. ఎస్సీ,ఎస్టీ కోర్టు న్యాయాధికారి సాధుబాబు, పోక్సో కోర్టు న్యాయాధికారి చిన్నబాబు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌కోర్టు న్యాయాధికారి పద్మ, డీఎల్ఎస్‌ఏ కార్యదర్శి రాజశేఖర్‌తోపాటు వారి కుటుంబ సభ్యులు వచ్చారు. వారికి ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. తిమ్మమాంబ, బాలవీరయ్యను సందర్శించి, ప్రత్యేక పూజలు చేయించారు. టూరిజం గైడ్ మనోహర్ తిమ్మమాంబ జీవిత చరిత్రను వివరించారు. మర్రిమాను ఊడలు, చరిత్రను తెలిపారు. అనంతరం మర్రి ఊడలను పరిశీలించారు. వారితోపాటు ఏఎస్ఐ కిషోర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు. అనంతరం గాండ్లపెంట మండలం కటారుపల్లిలోని యోగి వేమన ఆలయాన్ని సందర్శించారు. వీరికి ఆలయ పూజారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయం చుట్టూ రాసి ఉన్న వేమన పద్యాలు, జీవిత చరిత్రను పూజారులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఏఎస్ఐ వెంటరాముడు ఉన్నారు.

కదిరి లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో..

కదిరిలీగల్(ఆంధ్రజ్యోతి): కదిరి లక్ష్మీనరసింహస్వామిని ఎస్సీ, ఎస్టీ జిల్లా కోర్టు న్యాయాధికారి సాధుబాబు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతంపలికి అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు పార్థసారథి ఆచార్యులు శ్రీవారి సేవతో ఆశీర్వాదం చేశారు.

జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లాకు చెందిన కార్తీక్ ఎంపికయ్యాడు. ఈనెల 8, 9 తేదీల్లో కడపలో జరిగిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ అండర్-11 పోటీల్లో అత్యంత ప్రతిభ చాటిన కార్తీక్ జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. డిసెంబరు 8న గుజరాత్‌లోని వడోదరలో జరిగే నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2025 పోటీలకు కార్తీక్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. జాతీయ పోటీలకు ఎంపికైన కార్తీక్‌కు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బుగ్గయ్యచౌదరి, జయకుమార్, సభ్యులు రామాంజనేయులు, షాషావలి, శాప్ కోచ్ నరేష్‌కుమార్ క్రీడాసామగ్రి అందజేసి అభినందించారు.

అథ్లెటిక్స్‌కు..

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జాతీయ ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్ పోటీలకు రిద్ధి అనే విద్యార్థిని ఎంపికయింది. నగరంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో చదువుతున్న రిద్ధి ఇటీవల శ్రీకాకుళం జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-14 అథ్లెటిక్ 400 మీటర్ల విభాగంలో అత్యంత ప్రతిభ కనబరిచి సత్తా చాటడంతో జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. డిసెంబరు 1వతే దీ నుంచి మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగే జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 అథ్లెటిక్ పోటీలకు ప్రాతినిధ్యం వహించనుంది. రిద్ధిని డీఎస్‌డీఓ మంజుల, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శ్రీనివాసులు అభినందించారు.

జిల్లా జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ జిల్లా బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. ఆదివారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అండర్-17 బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాజట్ల వివరాలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ప్రకటించారు. సాఫ్ట్‌బాల్ బాలుర జట్టులో...బాలు, భరత్‌సింగ్ నాయక్, ప్రణీత్, సాయిరాజ్, ఖాసీం, కులశేఖర్, దినేష్‌నాయక్, మునీంద్ర, గణేష్, తరుణ్‌కుమార్, వేదశ్యామ్, శరవణకుమార్, ఫణీంద్రనాథ్‌రెడ్డి, అజయ్, ఘర్షణ్‌యాదవ్, దీక్షిత్‌రెడ్డి, రాజేష్ ఉన్నారు. బాలికల జట్టుకు...చందన, అంజలి, మైనావతి, పల్లవి, సుకన్య, రాధిక, నందిని, హేమలత, లక్ష్మీదేవి, శ్రావణి, ఆమని, లలితప్రియ, జనని, హారిక, పూజితాంజలి, లలిత ఎంపికయ్యారు. బేస్‌బాల్ బాలుర జట్టులో... స్టీఫెన్, నౌషాద్, జగన్మోహన్ రెడ్డి, శాంతన్‌సాయి, లోహిత్‌కుమార్, శివానంద, సందీప్, సంతోష్, రాహుల్, ప్రవీణ్, హుస్సేన్ వలీ, రాజశేఖర్, శివసాయి, రాఘవేంద్ర, సంతోష్‌కుమార్, ధరణి ఉన్నారు. బాలికల జట్టుకు పూర్ణిమ, వెన్నెల, కరీనా, సింధు, లిఖిత, చైతన్య, అక్షయ, తేజశ్రీ, అంజలి, తబసుం, రిషిత, నస్రీన్, ప్రత్యూష, జానూ, భవిత, జోష్నలు ఎంపికయ్యారు. ఎంపికైన జట్లను సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర సీఈఓ వెంకటేశులు అభినందించారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గాయత్రి, ఎస్‌జీఎఫ్ సభ్యులు లక్ష్మీనారాయణ, సుహాసిని, పీడీలు ప్రభాకర్, గోపాల్‌రెడ్డి, రామకృష్ణ, నరసింహారెడ్డి, పక్కీరప్ప, రమేష్, శివ, రాజశేఖర్ రెడ్డి, సంజీవరాయుడు, ఆంజనేయులు, లతాదేవి, హిమబిందు, ప్రమద, సూర్యనారాయణమ్మ, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో బంగారు పతకం

గుంతకల్లు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆలిండియా ఓపెన్ రోల్ స్కేటింగ్ టోర్నమెంట్‌లో గుంతకల్లుకు చెందిన విద్యార్థి బి.దేవానంద్ నరసింహ ప్రతిభను చాటి స్వర్ణ పతకాన్ని సాధించాడు. యూత్ రోలర్ స్కేటింగ్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాదులో ఆలిండియా లెవెల్‌లో ఓపెన్ స్కేటింగ్ పోటీలను నిర్వహించారు. గుంతకల్లులోని పెంగ్విన్ మాంటిస్సోరి పాఠశాలలో చదువుతున్న దేవానంద్ నరసింహ 8-10 సంవత్సరాల వయస్సు కేటగిరిలో జరిగిన రోల్ స్కేటింగ్ పోటీలో పాల్గొన్నారు. ఈ పోటీలో మొదటి స్థానంలో నిలిచిన ఈ విద్యార్థికి బంగారు పతకం లభించింది. జాతీయ స్థాయి ఓపెన్ పోటీలో ప్రతిభను చాటిన దేవానంద్ నరసింహను నిర్వాహకులు, కోచ్‌లు అభినందించారు.

స'ధర'ం స్లాట్ బుకింగ్..!

(5వ పేజీ తరువాయి)

నిమిషాల్లో బుకింగ్ చేస్తున్నారు. ఇచ్చుకోలేనివారు నెలల తరబడి తిరగాల్సిందే. డబ్బులెందుకు ఇవ్వాలని గట్టిగా ప్రశ్నించిన వారికి ఉమ్మడి అనంతపురం జిల్లా కాకుండా నెల్లూరు, శ్రీకాకుళం, కడప, కర్నూలు, తిరుపతి, చిత్తూరు ఇలా ఇతర జిల్లాల్లోని స్లాట్‌లను బుకింగ్‌చేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో స్లాట్‌బుక్ అయినా తెలియని ప్రాంతాలకు వందల కిలోమీటర్లు ప్రయాణించలేక సదరం క్యాంపులకు హాజరు కావడంలేదని వాపోతున్నారు. దళారుల ప్రమేయాన్ని నిలువరిస్తేనే తమకు న్యాయం చేకూరుతుందని బాధిత వర్గాలు వేడుకుంటున్నాయి.

నేటి నుంచి బుకింగ్ కొనసాగుతుందా..?

సదరం ధృవీకరణ పత్రాలకోసం ఈనెల 14 నుంచి స్లాట్ బుకింగ్ ప్రారంభమైనట్లు డీఎస్‌హెచ్ చక్రధర్ ప్రకటనలో తెలిపారు. ఆమేరకు శుక్ర, శనివారాల్లో జిల్లాలో అక్కడక్కడ సదరం స్లాట్‌బుకింగ్ చేశారు. ఈ రెండు రోజులు దళారుల చేతుల్లోని వారికి మాత్రమే అవకాశం దక్కింది. సోమవారం నుంచైనా అర్హుల కోసం స్లాట్‌బుకింగ్ ప్రక్రియ కొనసాగుతుందా? లేదా? అన్న అనుమానాలను బాధిత వర్గాలు వ్యక్తంచేస్తున్నాయి. హిందూపురం, అనంతపురం జిల్లా ఆస్పత్రులతోపాటు నియోజకవర్గ కేంద్రాల్లోని ఏరియా హాస్పిటళ్లలోనూ స్లాట్‌బుకింగ్ అయ్యేలా రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నాయి. లేకుంటే మరో మూడునెలలు నిరీక్షించక తప్పదని వాపోతున్నాయి.

న్యూస్ బాక్స్

రైతుల అభ్యున్నతికి సహకార బ్యాంకుల కృషి



రాచానపల్లిలో సహకార పతాకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురంరూరల్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతికి సహకార బ్యాంకులు ఎంతగానో కృషి చేస్తున్నాయని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని రాచానపల్లి సొసైటీలో ఆదివారం సొసైటీ చైర్మన్ పాముదాయి రఘు అధ్యక్షతన 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు జరిగాయి. ముఖ్య అతిథులుగా సంఘం మానిటరింగ్ అధికారి నాగమణి, రాయలసీమ సహకార శిక్షణ కేంద్రం సహకార విద్యాధికారి ఎంబీ మురళీమోహన్, సొసైటీ డైరెక్టర్లు శ్రీనివాసులు, నారాయణప్ప, సీఈఓ శ్రీనివాసులు హాజరయ్యారు. ఈసందర్భంగా సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. రైతులను ఆదుకునేందుకు సహకార సంఘాలు అనేక రకాల సేవలు అందజేస్తోందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకు రుణాలు తీసుకున్న రైతులు వాటిని తిరిగి చెల్లించేందుకు ఆసక్తి చూపాలన్నారు. అప్పుడే ఇతరులకు రుణాలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సంఘం ఉద్యోగులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నార్పల: మండలకేంద్రంలోని సొసైటీ కార్యాలయంలోనూ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. చైర్మన్ ఉమామహేశ్వర నాయుడు సహకార జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. సొసైటీ ద్వారా రైతులకు కావాల్సిన ఎరువులు, రుణాలు అందిస్తామన్నారు. డైరెక్టర్లు ఎన్.కుళ్లాయి రెడ్డి, గంజికుంట రామకృష్ణ, మానిటరింగ్ అధికారి ఇస్మాయిల్, సీఈఓ తారకరెడ్డి, సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

అనంతపురంరూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపల్లి పంచాయతీ పరిధిలోని రమణ కొట్టాల్లో తాగునీటి సమస్య పరిష్కారమైంది. గత కొన్నిరోజుల కిందట కాలనీలో తాగునీరు సరఫరా చేసే బోరు మోటార్, స్టార్టర్ పెట్టె కాలిపోవడంతో సమస్య నెలకొంది. దీంతో విషయాన్ని స్థానికులు మండల డిప్యూటీ ఎంపీడీఓ వెంకటనాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఈక్రమంలో ఆయన సర్పంచు శివశంకర్, ఏపీ ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లా అధ్యక్షుడు దండోరా రమణ చేత బోరుమోటారు, స్టార్టర్‌పెట్టెకు తక్షణ మరమ్మతు చేయించి తాగునీటి సరఫరాను పునరుద్ధరింపజేశారు.

చంద్రబాబుతోనే దళితుల అభ్యున్నతి

అనంతపురం వైద్యం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): దళితుల అభ్యున్నతి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి అక్కులప్ప ఆదివారం ప్రకటనలో అన్నారు. గత ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేయడంతో దళితులు మళ్లీ వెనుకబడ్డారన్నారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబు ఆ పథకాలను పునఃప్రారంభించి అమలు చేయాలని కోరారు. ఈ ఆర్థిక సంవత్సరం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా విడుదల చేసిన పథకాలకు దరఖాస్తులు స్వీకరించి అర్హులను ప్రకటించినా రుణసాయం అందలేదని, వెంటనే ఆ రుణాలను అందజేయాలని అన్నారు. అలాగే బెస్ట్ అవలబుల్ స్కూల్(బీఏఎస్), ఎన్ఎస్ఎఫ్ డీసీ వంటి పథకాలు పునఃప్రారంభించాలని కోరారు.

సబ్సిడీ ఉలవలను వినియోగించుకోండి

చెన్నేకొత్తపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): 80శాతం సబ్సిడీతో ఉలవలను పంపిణీ చేస్తున్నట్లు ఏఓ మురళీకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10కేజీల బ్యాగుకు సబ్సిడీ పోనూ రైతులు రూ.112 చెల్లించాలన్నారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, సెల్‌నెంబర్‌తో సంబంధిత గ్రామాలోని రైతు సేవా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అలరించిన సంగీత విభావరి



ఘంటసాల పాటలు పాడుతున్న పాలసముద్రం నాగరాజు

అనంతపురం టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని త్యాగరాజ సంగీత సభలో ఆదివారం నిర్వహించిన సంగీత విభావరి వీక్షకులను ఎంతగానో అలరించింది. పీటీసీ వైస్ ప్రిన్సిపాల్ వాసుదేవన్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గాయనీగాయకులు ఘంటసాల పాటలను ఆలపిస్తూ స్వర నీరాజనం పలికారు. కార్యక్రమంలో విశ్రాంత తహసీల్దార్ పాలసముద్రం నాగరాజు, తిరుపతికి చెందిన గాయకురాలు శ్రీప్రియ, వంశీ కళా క్షేత్రం ప్రతినిధి జియల్ కుమార్, ఎస్‌వి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మైనార్టీ జిల్లా కమిటీ ఏర్పాటు



నియామక పత్రం అందజేస్తున్న దాదాగాంధీ

అనంతపురం వైద్యం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మైనార్టీ జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాదాగాంధీ పేర్కొన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి దాదాగాంధీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర అధిష్టానం ఆదేశాల మేరకు నూతన కమిటీలను నియమిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా జిల్లా కమిటీని నియమించామన్నారు. అధ్యక్షుడిగా శర్మాస్‌వలి, ఉపాధ్యక్షులుగా షఫి, జమీల్ బాషా, మోదిన్ బాషాతోపాటు ఇతర సభ్యులను నియమించి నియామక పత్రాలందజేశామన్నారు. నాయకులు గాజుల వాసు, రామ్ చరణ్ యాదవ్, కృష్ణ, నరసింహారెడ్డి, నారాయణస్వామి పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మకమలాలు



ఒకే కొమ్మకు వికసించిన మూడు బ్రహ్మకమలాలు

అనంతపురం టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో కాంట్రాక్టర్ గుంటూరు గోవర్ధన్, లక్ష్మీ దంపతుల నివాసంలో బ్రహ్మకమలాలు వికసించాయి. రామ్‌నగర్ క్రీసెంట్ స్కూల్ పక్కవీధిలోని సాయి దత్త నిలయంలో వారు నివాసముంటున్నారు. రెండేళ్ల క్రితం తెలిసినవారి ఇంటి నుంచి బ్రహ్మకమలం మొక్కకు చెందిన ఓ కొమ్మను తీసుకొచ్చి ఇంట్లో నాటుకుని తరచూ పూజలు నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం అది మొక్కగా మారింది. కాగా బ్రహ్మకమలం మొక్కకు సాధారణంగా ఏడాదికి ఒకసారి ఒక కొమ్మకు ఒకే పుష్పం మాత్రమే పూసి వికసిస్తుంటుంది. అయితే వీరి ఇంటిలో ఉన్న మొక్కలో ఒకే కొమ్మకు ఆదివారం ఏకంగా మూడు పుష్పాలు వికసించాయి. ఈ విషయం ఆనోటా ఈనోటా వ్యాపించడంతో స్థానికులు పెద్దఎత్తున తరలి వచ్చి బ్రహ్మకమలాలను తిలకించారు.



బద్దలాపురంలో ఆగిన అంగన్‌వాడీ భవన నిర్మాణం



మామిళ్లపల్లిలో..

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనాలు

- గత వైసీపీ ప్రభుత్వంలో నిధుల జాప్యం వల్ల పూర్తికాని పనులు
- అద్దె, శిథిల భవనాల్లో కొనసాగింపు
- అసౌకర్యాలతో ఇబ్బంది పడుతున్న చిన్నారులు

కనగానపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నాడు-నేడు కింద పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు మారుస్తామని గత వైసీపీ ప్రభుత్వం గొప్పగా చెప్పింది. అయితే నిధుల మంజూరులో తీవ్రజాప్యం చేయడంతో వాటి భవన నిర్మాణాలు మధ్యలో ఆగిపోయి మొండిగోడలు దర్శనమిస్తున్నాయి. మండలంలో చాలా చోట్ల ఈ పరిస్థితి నెలకొంది. దీంతో ఆహ్లాదకర వాతావరణలో పెరగాల్సిన చిన్నారులు అద్దె, శిథిలావస్థ భవనాల్లోని ఇరుకు గదుల్లో , అసౌకర్యాల నడుమ ఉంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలో 59 అంగన్‌వాడీ కేంద్రాలుండగా వాటిలో 20 కేంద్రాలకు మాత్రం పక్కా భవనాలున్నాయి. ఇక 12 అద్దె భవనాల్లో నడుస్తుండగా.. మిగతా వాటిలో కొన్ని పాత శిథిలావస్థకు చేరిన భవనాల్లో, అంగన్‌వాడీ టీచర్ల ఇళ్లల్లో కొనసాగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు కింద ఆయా కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించేందుకు గాను ఒక్కో కేంద్రానికి రూ.14 లక్షలు మంజూరు చేసింది. ఇందుకు విద్యాశాఖ, పంచాయతీరాజ్, ఐసీడీఎస్, విద్యార్థుల తల్లిదండ్రులతో కమిటీ సైతం ఏర్పాటుచేసింది. తర్వాత మొదట మంజూరైన నిధులతో కాంట్రాక్టర్లు కొంత వరకూ పనులు చేపట్టారు. తర్వాత ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంలో జాప్యం చేసింది. దీంతో మిగిలిన పనులు ముందుకు సాగక మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో పక్కా భవనాలు పూర్తిగాక పిల్లలు అద్దె భవనాల్లో, పాత శిథిలావస్థ భవనాల్లో అరకొర వసతుల నడుమ తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా మామిళ్లపల్లి, బద్దలాపురం, పాతపాళ్యం, మద్దులచెరువు తదితర గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వమైన నిధులు మంజూరు చేసి భవన నిర్మాణాలు పూర్తి చేయాలని, చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సమస్యను అధికారులకు తెలియజేశాం..

నాడు నేడు కింద మంజూరైన నిధులతో అంగన్‌వాడీ భవన నిర్మాణాలు జరిగాయి. నిర్మాణాలకు కమిటీని గతంలోనే ఏర్పాటు చేయడం జరిగింది. కమిటీ ఖాతాలో అమౌంట్ కూడా ఉంది. సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేశాం. వారి అదేశాల మేరకు నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

-ప్రశాంతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, కనగానపల్లి

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



పూజలో పాల్గొన్న మాలధారులు

గార్లదిన్నె, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివాలయం వద్ద ఆదివారం రాత్రి అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పడి పూజ మహోత్సవం వైభవంగా జరిగింది. ప్రతి ఏడాది కార్తీక మాసంలో అయ్యప్ప మాలధారులు అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా ఈ ఏడాది కూడా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి, శివుడి మాలధారులు పెద్దఎత్తున ఆలయం వద్దకు చేరుకుని అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహానికి వివిధ అభిషేకాలు చేసి పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పూజలు జరిపారు. భజనలు చేపట్టారు. తర్వాత అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో గురుస్వాములు రాము, గేటు క్రిష్ణారెడ్డి, గుత్తాలక్ష్మీనారాయణ, వెంకటేష్, శేఖర్, కేదార్‌రెడ్డి, చరణ్‌తేజ్‌రెడ్డి, రవితేజ, సురేష్, ఉజ్వల్‌తేజ్, శివ, మధు, జస్వంత్‌రెడ్డి, నిరంజన్, చక్రధర్‌రెడ్డి, మనోహర్, చంద్ర, రామాంజిరెడ్డి, దామోదర్, నవీన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ తరహాలో అన్ని స్కూళ్లను తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ పాఠశాలల తరహాలోనే రాష్ట్రంలోని అన్ని పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని కార్యాలయంలో ఆదివారం యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈసందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లింగమయ్య, సుధాకర్ మాట్లాడుతూ పీఎంశ్రీ పేరుతో ఎంపికైన పాఠశాలల అభివృద్ధికి కేంద్రం అనేక నిధులు మంజూరు చేస్తోందన్నారు. అదేమాదిరిగానే ఇతర స్కూళ్లను సీఎంశ్రీ పేరుతో అభివృద్ధికి సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే టీచర్లకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాలన్నారు. పెండింగ్‌డీఏలు, పీఆర్సీ కమీషన్, ఐఆర్ వెంటనే ప్రకటించాలన్నారు. డీఎస్సీ రాసి పోటీపరీక్షలలో ప్రతిభ చూపి టీచర్లుగా ఎంపికై దశాబ్దాలుగా పనిచేస్తున్న వారిని ఇపుడు టెట్ రాయాలనడం సరికాదన్నారు. కోర్టులో రివ్యూపిటీషన్‌వేసి మినహాయింపునకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రమణయ్య, రామప్ప, ఈశ్వరయ్య, దేవేంద్రమ్మ, సంజీవ్‌కుమార్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీకి తరలిన దళిత సంఘాల నాయకులు

అనంతపురం వైద్యం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయిపై ఇటీవల జరిగిన దాడిని ఖండిస్తూ సోమవారం న్యూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అధ్యక్షతన ఆత్మగౌరవ ప్రదర్శన జరగనుంది. కార్యక్రమానికి ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి ఆదివారం వందల సంఖ్యలో ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎస్‌పీ, ఎంఎస్ఎఫ్ నాయకులు తరలివెళ్లారు. ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌కు చేరుకుని జంతర్ మంతర్‌కు వెళ్లనున్నట్లు ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్, జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడమే ధ్యేయంగా దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన చేపట్టనున్నట్లు వారు పేర్కొన్నారు.

టీడీపీ కార్యకర్తకు పరామర్శ

శింగనమల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద జలాలపురం టీడీపీ సీనియర్ కార్యకర్త సుబ్బారెడ్డిని ఆ పార్టీ మండల నాయకులు ఆదివారం పరామర్శించారు. సుబ్బారెడ్డి గత కొద్ది రోజులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసున్న పార్టీ మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, సింగిల్‌విండో అధ్యక్షుడు గుర్రం లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, చింత బరిదొర, చిదనంద నాయుడు, ప్రసాద్‌రెడ్డి, సుధీర్‌నాయుడు, చెన్నయ్య, గంగన్న తదితరులు ఆ గ్రామానికి వెళ్లి అతన్ని పరామర్శించారు. ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



నాగసముద్రంలో వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

చెన్నేకొత్తపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగసముద్రం గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామానికి చెందిన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేశు సహకారంలో ఎస్వీ ఇన్ఫ్రాటెక్ వారు స్థానిక ఉన్నత పాఠశాలలో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశా రు. ఇందులో గుండె, కంటి ,డెంటల్‌కు సంబంధించి వైద్యు లు పరీక్షలు నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్యశిబిరం కొనసాగింది. దాదాపు 100మందికి పైగా పాల్గొని వైద్యపరీక్షలు చేయించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గుండెకు సంబంధించి ఐదుగురికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించినట్లు వైద్యులు తెలిపారు.

పి. సిద్ధరాంపురంలో..

ఆత్మకూరు: మండలంలోని పి. సిద్దరాంపురంలో సత్యసాయి మిత్ర మండలి ట్రస్టు సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటైంది. ఇందులో సుమారు 200మందికిపైగా వైద్యపరీక్షలు చేయించుకున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

టెట్ మినహాయింపునకు కృషి చేయండి

- సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజాకు ఎస్టీయూ వినతి



రాజాకు వినతి పత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం విద్య, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సర్వీస్ టీచర్లకు టెట్ పరీక్ష పెట్టడం సరికాదని, దాని నుంచి మినహాయింపునకు కేంద్రం దృష్టికి తీసికెళ్లి కృషి చేయాలని సీపీఐ జాతీయ ప్రధానకార్యదర్శి రాజాకు ఎస్టీయూ జిల్లా నాయకులు విన్నవించారు. ఎస్టీయూ నాయకులు రమణారెడ్డి, రామాంజనేయులు, కృష్ణమూర్తి, శివయ్యాచారి, సూర్యుడు తదితరులు సీపీఐ జాతీయ ప్రధానకార్యదర్శిని విజయవాడలో ఆదివారం కలిశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దశాబ్దాలుగా పని చేస్తున్న టీచర్లకు ఇపుడు టెట్ పరీక్ష పెట్టి అందులో పాస్‌కావాలనే నిబంధన పెట్టడం సరికాదన్నారు. ఇది సుప్రీం కోర్టు ఉత్తర్వులు అని ప్రభుత్వాలు అంటున్నాయని వాపోయారు. కేంద్రం దృష్టికి తీసికెళ్లి కోర్టులో రివ్యూపిటీషన్ వేయించి టెట్ మినహాయింపునకు కృసిచేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

వైభవంగా సహస్ర శంఖాభిషేకం



శివలింగాకృతిలో శంఖాలు..



పూజలు చేస్తున్న అప్పాస్వామి

అనంతపురం టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని శివకోటి మందిరంలో నిర్వహిస్తున్న మహారుద్ర-సహస్ర శంఖాభిషేక వేడుకల్లో భాగంగా మూడో రోజున ఆదివారం సహస్ర శంఖాభిషేకం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో శివకోటి పీఠం వ్యవస్థాపకుడు అప్పాస్వామి నేతృత్వంలో వేద పండితులు వేద మంత్రోచ్చారణల నడుమ 1008 శంఖాలతో నదీజలాలను తీసుకొచ్చి, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం శివకామేశ్వరస్వామిని ఆ జలాలతో అభిషేకించారు. శివలింగాకృతిలో సహస్ర శంఖాలను ఏర్పాటు చేయడం చూపరులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో శివకోటి ఆలయ ట్రస్టు సభ్యులు అమర్నాథ్, నరసింహం, ఆలయ ప్రధానార్చకులు హరికృష్ణ, అనిల్‌రెడ్డి, రమేష్, భక్తులు పాల్గొన్నారు.

'సతీష్‌ను చంపినోళ్లను కఠినంగా శిక్షించాలి'



మాట్లాడుతున్న శాలివాహన ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు

అనంతపురంవిద్య, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): టీటీడీ మాజీ ఏవీఎస్‌ఓ సతీష్ సతీష్‌కుమార్‌ను హత్య చేసిన వాళ్లను కఠినంగా శిక్షించాలని శాలివాహన ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం నాయకులు కుమ్మర ఓబులపతి, రామాంజనేయులు, లక్ష్మన్న, నాగేంద్ర, శంకరయ్య విలేకరులతో మాట్లాడారు. సతీష్‌ను హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. హత్యకు పాల్పడిన వారిని ప్రభుత్వం గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. అలాగే మృతుడి కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా అందించడంతో పాట ఆ కుటుంబంలో ఒకరికి వెంటనే ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

'పూజారిది అనవసర రాద్ధాంతం'

శింగనమల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): శింగనమల చెరువు కట్ట మీద వెలసిన పురాతన దుర్గాంజనేయస్వామి ఆలయ నూతన కమిటీ సభ్యులు గత శనివారం ఆలయ తాళాలు అడిగితే పూజారి సిరి రమణాచారి వాటిని ఇవ్వకపోగా.. బలవంతం చేస్తే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని, నా చావుకు టీడీపీకి చెందిన ఓ నాయకురాలు, సీఐ, తహసీల్దార్ అంటూ పేర్కొంటానని బెదిరింపులకు దిగిన విషయం తెలిసిందే. అయితే ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ వీడియో వైరల్ అవడానికి కారణం ఓ వైసీపీ నాయకుడని తెలుస్తోంది. పూజారి కొందరు వైసీపీ నాయకులు చెప్పిన మాటలతోనే ఇలా బెదింపులు చేస్తున్నట్లు కూడా సమాచారం.

పూజారిని తొలగించే ఉద్దేశం లేదు: నూతన కమిటీ

పురాతన ఆలయం అభివృద్ధికి నోచుకోలేదనే భావనతో నూతన కమిటీ ఏర్పాటు చేశామని ఆ కమిటీ సభ్యులు తెలిపారు. ఐదేళ్లుగా ఆలయ పూజారి భక్తులకు అందుబాటులో ఉండడం లేదని, అందుకే ఇప్పటి నుంచి అయినా అందుబాటులో ఉండి పూజలు చేయమని చెప్పామని, అంతేగాని అతన్ని తొలగించాలనే ఉద్దేశం తమకు ఎంతమాత్రం లేదని అన్నారు. పూజారే అనవసర రాద్ధాంతం చేస్తున్నారన్నారు. ప్రస్తుతం ఆలయ కమిటీ అధ్యక్షురాలిగా ఎమ్మెల్యే తల్లి ఉన్నారని, ఆమె ఆధ్వర్యంలో ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని, ఇక్కడే అందుబాటులో ఉండి పూజలు సక్రమంగా చేయాలని మాత్రమే పూజారికి చెప్పామన్నారు. మంచికి చెబితే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపులకు పాల్పడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పూజారి వైసీపీ నాయకుల మాటలు విని ఇలాంటి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు వారు పేర్కొన్నారు.

జంగమ, వీరశైవ లింగాయత్‌ల సంక్షేమానికి కృషి



వనభోజన వేడుకలో ఏపీ జంగమ కార్పొరేషన్ చైర్మన్ చంద్రశేఖర్ ఇతరులు

బుక్కరాయసముద్రం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జంగమ, వీర శైవ లింగాయత్ కులస్థుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏపీ జంగమ కార్పొరేషన్ చైర్మన్ చంద్రశేఖర్ , ఏపీ వీర శైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ స్వప్న అన్నారు. కార్తీక మాసం సందర్భంగా జంగం కులస్థుల ఆధ్వర్యంలో వన భోజన కార్యక్రమం మండల కేంద్రంలోని దేవరకొండ వద్ద టీటీడీ కళ్యాణమండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జంగమ, లింగాయత్‌ల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో చొరవ తీసుకుంటామన్నారు. పేద, మధ్య తరగతి వారికి ఇంటి పట్టాలతో పాటు పక్కా గృహాలు, విద్య, వైద్యం ఉపాధి కల్పించడానికి పాటు పడతామన్నారు. కార్యక్రమానికి ఉరవకొండ గవిమఠం పీఠాధిపతి కరిబసవ రాజేంద్ర స్వాములు, హాళ మఠం స్వాములు చెన్నవీర శివాచర్యాలు హాజరయ్యారు. తర్వాత ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టెన్త్, ఇంటర్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఆయా కులస్థుల విద్యార్థులకు నగదు పురస్కారాన్ని అందజేశారు. జంగమ కులస్థుల చైర్మన్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలు పూడ్చిన వారిపై చర్యలు తీసుకోండి

గార్లదిన్నె, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వరిపైర్లకు సాగునీరు సరఫరా అయ్యే కాలువలను పూడ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా నాయకుడు శ్రీనాథ్‌చౌదరి డిమాండ్ చేశారు. మండలంలోని కల్లూరు గ్రామంలోని 44వ జాతీయ రహదారి పక్కనే సాగవుతున్న వరి పంటలకు సాగునీరు సరఫరా అయ్యే కాలువలను కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు పూడ్చివేశారు. వాటిని సీపీఐ నాయకులు ఆదివారం పరిశీలించారు. అనంతరం వారు బాధిత రైతులతో మాట్లాడి పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ.. వందలాది ఎకరాల్లో రైతులు వరిపంటలను సాగుచేసుకుంటున్నారన్నారు. అయితే వాటికి నీటిని సరఫరా చేసే కాలువలతో పాటు పైర్లలోంచి నీరు బయటికి వెళ్లే కాలువలను రియల్ వ్యాపారులు స్వార్థ ప్రయోజనాల కోసం పూడ్చి వేసి వెంచర్లు వేశారని వాపోయారు. ప్రస్తుతం వరిపైర్లో నీరు నిల్వ ఉండడంతో పంటను తొలగించుకునేందుకు అవకాశం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. అధికారులు స్పందించి పూడ్చిన కాలువలను తవ్వించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రాముడు, సహాదయ కార్యదర్శి రామకృష్ణ, యువజన సమాఖ్య నాయకులు నరేంద్ర బాబు, రైతులు శంకర్, మహమ్మద్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భక్త కనకదాస జయంత

శింగనమల,నవంబరు16(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం కేంద్రం శింగనమలలో ఆదివారం భక్త కనకదాసు జయంతిని నియోజకవర్గంలోని కురబ కులస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కురబ కార్పొరేషన్ డైరెక్టర్ ఆవుల కృష్ణయ్య, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజే నాగరాజు, కురుబ సంఘం మండల అధ్యక్షుడు మంకెర నాగేంద్ర ఆధ్వర్యంలో స్థానిక ఆత్మ రామ ఆలయం వద్ద భక్త కనక దాస చిత్ర పటం ఏర్పాటు చేసి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ సంఘం నాయకులు మాట్లాడుతూ కురబలు ఐక్యతతో రాజకీయంగా, ఆర్థికంగా బలపడాలని సూచించారు. శింగనమలలో భక్త కనకదాస విగ్రహం ఏర్పాటుకు తీర్మాణం చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో. నాయకులు బ్యాళ్ల నాగేంద్ర, అవిలిగొండ చలపతి, రాగేసురేష్, బ్యాళ్ల సుదర్శన్, బండి పరశురాం, పట్నం నగేష్, చిక్కిల చంద్రాయుడు, బండి కొండయ్య, పులకుంట నారాయణస్వామి, వీరనారాయణ, ఉద్దాల అనిల్ పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయిబాబా శతజయంతి

అనంతపురం టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి బాబా శతజయంతిని పురస్కరించుకుని ఆదివారం హెచ్చెల్సీ కాలనీలోని కొల్హాపూర్ మహాలక్ష్మి ఆలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో షిర్డీసాయిబాబా, సత్యసాయిబాబా చిత్రపటాలకు ప్రత్యేక అలంకరణలు చేసి విశేష పూజలు జరిపారు. అనంతరం భక్తులు స్వామివారి 100వ జయంతి నేపథ్యంలో 100 భక్తిగీతాలను ఆలపించి స్వరనీరాజనం పలికారు. కార్యక్రమంలో అక్కల్‌కోట మహరాజ్ సేవా సమాజ్ ప్రధాన కార్యదర్శి దేవనూరు సుందరం విజయ్‌కుమార్, ఆలయ ప్రధానార్చకుడు పుబ్బరాజు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



భక్తిగీతాలు ఆలపిస్తున్న భక్తులు

న్యూస్ బాక్స్

వైభవంగా వీరభద్రస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఉరవకొండ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక పేట వీధిలోని వీరభద్రస్వామి ఆలయంలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి తరపున పల్లవి, కేదార్‌నాథ్, అమ్మవారి తరఫున లావణ్య సోముశేఖర్ ఈ వివాహం జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామి వారికి రూ.70వేల విలువ చేసే వెండి కవచాన్ని ఆలయ అధ్యక్షుడు బండయ్య అందజేశారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఆలూరుకోనలో పల్లకిలో ఊరేగుతున్న స్వామి, అమ్మవారు

తాడిపత్రి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూరుకోన, గంగాదేవిపల్లిలోని ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలూరుకోనలో శ్రీదేవిభూదేవి, రంగనాథస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం పల్లకి సేవ నిర్వహించారు. గంగాదేవిపల్లిలో గంగమ్మ అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో స్వామివార్లను దర్శించుకున్నారు.

ఘనంగా చండీయాగం



చండీయాగంలో పాల్గొన్న భక్తులు

కణేకల్లు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక పాత పోలీస్‌స్టేషన్ వెనుక ఉన్న దుర్గమ్మ దేవాలయం వద్ద చండీయాగాన్ని ఆదివారం నిర్వహించారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఈ యాగాన్ని నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తిప్పేస్వామి తెలిపారు. రాష్ట్ర వీరశైవ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ స్వప్న హాజరయ్యారు.

అయ్యప్ప మాలధారుల శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

యాడికి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అయ్యప్ప మాలాధారులు స్వామివారి చిత్రపటం, కలశాలతో ఆదివారం శోభాయాత్ర నిర్వహించారు. గురుస్వామి చిట్టి, పలువురు కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. నేటి నుంచి సంక్రాంతి వరకు అయ్యప్ప స్వామి ఆలయంలో మాలాధారులకు భిక్ష ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో ఆలయ అర్చకుడు నాగరాజుశర్మ పాల్గొన్నారు.

కసాపురం ఆలయ అభివృద్ధికి విరాళం

గుంతకల్లుటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధికి అదే గ్రామానికి చెందిన చాకలి చిన్న లింగప్ప కుమారుడు పవన్‌కుమార్ రూ. 1,00,116 విరాళంగా ఇచ్చారు. ఆ చెక్కును ఆలయ ఈఓ మేడేపల్లి విజయరాజుకు ఆదివారం అందజేశారు.



టూరిస్ట్ హబ్‌గా కుందుర్పి



కుందుర్పిలో పరిశీలిస్తున్న అధికారులు

కుందుర్పి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కుందుర్పిలో పురాతన ఆలయాలు, చారిత్రక కట్టడాలు ఉండటంతో ఈ ప్రాంతాన్ని టూరిస్ట్ హబ్‌గా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇటీవల కలెక్టర్ ఆదేశించారు. దీంతో ఉమ్మడి జిల్లా పురావస్తు శాఖ ఏడీ స్వామి నాయక్, ఉపాధి హామీ పీడీ సలీంబాషీ కుందుర్పి కొండను ఆదివారం పరిశీలించారు. వారి వెంట ఏపీఓ మురళీధర్, ఉపాధి హామీ సిబ్బంది బీజేపీ నాయకుడు గంగాధర ఉన్నారు.

రైతులకు న్యాయం చేయండి

శెట్టూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యగార్లపల్లిలో సర్వే నెంబర్ 172-1లోని 3.16 ఎకరాలను ఏళ్ల తరబడి తాము పంటలు సాగు చేసుకొంటున్నారని, ఆ భూములు తమకే చెందేలా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ రైతులు ఆదివారం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఈశ్వరమ్మను కలిసి.. వినతి పత్రం అందజేశామన్నారు. కొందరు ఆ స్థలాలను విక్రయించడానికి యత్నిస్తున్నారని, దాన్ని అడ్డుకోవాలన్నారు. విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు పంపి.. తగు చర్యలు చేపడతామని తహసీల్దార్ చెప్పారన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద అయ్యగార్లపల్లి రైతులు

కరువు నేలలో కాసుల పంట

డ్రాగన్ ఫ్రూట్, అవకాడో సాగుతో అధిక లాభాలు





ఆధునిక పద్ధతిలో సాగు చేసిన అవకాడో మొక్క, డ్రాగన్ ఫ్రూట్స్ పంట, రైతు సిద్దారెడ్డి (ఇన్‌సెట్లో)

శెట్టూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పెరుగుపాలెం పంచాయతీ వడ్డీపాలెం గ్రామ రైతు సిద్దారెడ్డి సాంప్రదాయ పంటలకు స్వస్తి పలికి .. ఆధునిక పద్ధతిలో.. సేంద్రీయ విధానంలో.. కొత్త రకం పంటలైన డ్రాగన్ ఫ్రూట్, అవకాడో సాగు చేసి.. లాభాలు గడించాడు. నాలుగు ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ పంటను పందిరి పద్ధతిలో సాగు చేశారు. రూ.అరకోటిపైగా పెట్టుబడితో ఈ పంటను సాగు చేశారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ.వందకు విక్రయిస్తున్నారు. అలాగే రెండు ఎకరాల్లో రూ.10 లక్షలతో పెట్టుబడితో అవకాడో పంటను సాగు చేశాడు. ప్రస్తుతం మార్కెట్లో దీని ధర కిలో రూ. 150 నుంచి రూ. 200కు విక్రయిస్తున్నారు. మంచి దిగుబడి వస్తుండటంతో.. అధిక లాభాలు సాధించారు. దీనిపై సిద్దారెడ్డి మాట్లాడుతూ.. 'ప్రస్తుత కాలంలో అందరూ ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. అందులో సేంద్రీయ పంట అంటే మరీ డిమాండ్ ఎక్కువ. డ్రాగన్ ఫ్రూట్, అవకాడోకు ప్రస్తుతం అధిక డిమాండ్ ఉంది. డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు హైదరాబాద్ నుంచి తెచ్చాను. ఒక్కొక్క మొక్క రూ.110 ప్రకారం మొత్తం 2022 మొక్కలు కొన్నా. పంట సాగు చేసిన ఎనిమిది నెలల నుంచి దిగుబడి మొదలైంది. దిగుబడి ఏడాదికి రెండు సార్లు చొప్పున 30 ఏళ్ల పాటు ఇస్తాయి. అన్ని పంటల కన్నా నీటి తడులు తక్కువ. మూడు రోజులకు ఒకసారి గంటసేపు నీరు ఇస్తే చాలు. ఒకరకంగా వీటిని ఎడారి మొక్కలని పిలుస్తారు. విజయవాడ, బెంగళూరు, కేరళ తదితర ప్రాంతాల్లో డ్రాగన్ ఫ్రూట్స్‌కు డిమాండ్ ఎక్కువ. ఈ పంట సాగు చేసినప్పుడు మొదట ధర బాగుండేది. ప్రస్తుతం మార్కెట్లో ధరలు తగ్గాయి. ఇక అవకాడో ఏడాదికి ఒకసారి మాత్రమే పంట ఇస్తుంది. ఇది కూడా 30 ఏళ్ల పాటు దిగుబడులిస్తాయి. ప్రభుత్వం మార్కెట్ సదుపాయం కల్పించాలి.' అని కోరారు.



ఉంతకల్లు : కనకదాస చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న కురుబలు



కణేకల్లు: కనకదాస చిత్రపటాన్ని ఊరేగిస్తున్న కురుబలు

ఘనంగా కనకదాస జయంతి

గుంతకల్లు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కనకదాస జయంతి సందర్భంగా పాత గుంతకల్లులోని బీరప్ప సర్కిల్‌లో ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పూజలు నిర్వహించారు. అలాగే టీడీపీ బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్ పవన్‌కుమార్ గౌడ్ కూడా విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వనభోజనాలు, రక్తదాన శిబిరంలో పాల్గొన్నాడు.

- బొమ్మనహాళ్: ఉంతకల్లులో గంగజలం తెచ్చి.. కనకదాస చిత్రపటానికి అభిషేకించి.. పూజలు నిర్వహించారు. చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు.
- కణేకల్లు: స్థానిక వీరనాగమ్మ కట్ట వద్ద నుంచి దిగువగేరి వరకు కనకదాస చిత్రపటాన్ని ఊరేగించారు. ఇందులో యువతులు హారతులతో పాల్గొన్నారు.



గుంతకల్లు : కనకదాస విగ్రహం వద్ద ఎమ్మెల్యే గుమ్మనూరు

యాడికి వైద్యశాలకు హంగులు

- రూ.24 లక్షలతో మరమ్మతులు



యాడికి ప్రభుత్వ వైద్యశాల

యాడికి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి నిర్వహణ సరిగా లేక భవనం శిథిలావస్థకు చేరుకుంది. కప్పు పెచ్చులు ఊడిపడుతుండటంతో సిబ్బంది, రోగులు భయం.. భయంగా ఆస్పత్రిలోకి వెళ్లేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ఆ ఆస్పత్రి సమస్యలపై ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. సుమారు రూ.24 లక్షలతో ఆ ఆస్పత్రికి మరమ్మతులు చేయించారు. వైద్యుల గది, రక్తపరీక్షల గది, రోగులు వేచి ఉండే వరండా, రోగులకు మంచాలు, పెయింటింగ్ వర్క్, ప్రహరీ.. ఇలా అన్ని మరమ్మతులు చేశారు. ల్యాబ్‌లో ఆధునిక పరికరాలను ఏర్పాటు చేశారు. మెరుగైన వైద్య సేవలు అందుతుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఆధునిక పరికరాలున్న ఆసుపత్రిలోని ల్యాబ్

ప్రధాన రహదారిలో మురుగునీరు

తాడిపత్రి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడాయిపల్లిలో ప్రధాన రహదారిపై ఇలా మురుగునీరు నిల్వ ఉంటోంది. ఇక చిన్నపాటి వర్షం వచ్చినా.. కుంటను తలపించేలా నీరు నిల్వ ఉంటుంది. పంచాయతీ అధికారులు స్పందించి.. మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.



ప్రధాన రహదారిలో నిలిచిన మురుగునీరు

కాలువపై మట్టిరోడ్డు ఏర్పాటు



రోడ్డు వేయిస్తున్న టీడీపీ నాయకులు

విడపనకల్లు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జీబీసీ (గుంతకల్లు బ్రాంచ్ కాలువ), జీఎస్‌బీసీ (గుంతకల్లు సబ్ బ్రాంచ్ కాలువ)లపై కంప చెట్లు భారీగా పెరిగాయి. వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు పడేవారు. మంత్రి పయ్యావుల కేశవ్, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూర్ జయరాం ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో కాలువపై కంప చెట్లు తొలగించి.. రోడ్డు బాగు చేయించినట్లు జీబీసీ కాలువ అధ్యక్షుడు కాలువ మారయ్య ఉపాధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుత్తి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏపీ ట్రాన్స్‌కో గుత్తి డివిజన్ పరిధిలో ఈనెల 17 నుంచి 28 వరకు మరమ్మతులు చేపడుతున్నామని, దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగే అవకాశముందని స్థానిక ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మానాభపిళ్లై ఆదివారం తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

శ్రీకృష్ణ యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడిగా డాకరాజు

తాడిపత్రి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణయాదవ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన డాకరాజు యాదవ్‌ను ఎంపికచేశారు. తిరుపతిలో ఆదివారం జరిగిన సమావేశంలో తనకు ఈ నియామక పత్రాన్ని అందజేశారని ఆయన తెలిపారు.

గ్యాస్ వినియోగదారులకు ఈకేవైసీ తప్పనిసరి

బొమ్మనహాళ్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వంట గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ తప్పని సరిగా చేయించుకోవాలని అని ఇండియన్ గ్యాస్ నిర్వహకుడు సాయిసుధీర్ సూచించారు. ఆదివారం మండలంలోని బండూరు, దేవగిరి గ్రామాల్లో గ్యాస్ వినియోగదారుల ఈకేవైసీ చేయించారు. 200 మంది వినియోగదారులకు ఈకేవైసీ చేశారు. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు సురక్ష పైపులను తప్పనిసరిగా ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి మార్చుకోవాలన్నారు.



బండూరులో ఈకేవైసీ చేస్తున్న గ్యాస్ సిబ్బంది

కల్యాణ మండపం నిర్మాణానికి సహకరించండి

తాడిపత్రి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక యల్లనూరురోడ్డు బైపాస్‌రోడ్డులోని శాలివాహన సంఘం కల్యాణ మండపం నిర్మాణానికి దాతలు సకహకరించాలని ఆ కల్యాణ మండపం అధ్యక్షుడు రామకృష కోరారు. ఆదివారం ఆ మండపంలో కుమ్మరి శాలివాహన సంఘం డైరెక్టర్ వెంకటసుబ్బయ్య, కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలూరుకు చెం దిన శివరాముడు రూ.25 వేలు విరాళంగా ఇచ్చారన్నారు. దీని నిర్మాణం పూర్తి కావడానికి ఇంకా రూ.30 లక్షల వరకు కావాల్సి ఉందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్

సహకార బ్యాంకు కార్యాలయం ప్రారంభం

పామిడి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎద్దులపల్లి రోడ్డులో ఏర్పాటు చేసిన వీ కొత్తపల్లి సహకార బ్యాంకు కార్యాలయాన్ని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆదివారం ప్రారంభించారు. సహకార సంస్థ బ్యాంకులు రైతులకు విరివిరిగా రుణాలిచ్చి ఆదుకోవాలని కోరారు. అనంతరం విజయవాడలో గత నెల 6నుంచి 9వ తేదీ వరకూ నిర్వహించిన రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలలో ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపికైన సుమారు 20 మంది విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం పట్టణంలోని జెండాకట్ట వద్ద నిర్వహించిన గ్యార్మీ వేడుకల్లో ఎమ్మెల్యే, టీడీపీ మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

● **చెక్కుల అందజేత**: పట్టణంలోని మెయిన్ బజార్‌లో నివాసముండే బొమ్మా సరళ, బొడ్రాయి నాయీబ్రాహ్మణ కాలనీలో నివాసముండే రమేష్ టీడీపీ కార్యకర్తలుగా సభ్యత్వం పొందారు. వీరు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. తెలుగుదేశం పార్టీ బాధిత ఒక్కొక్క కుటుంబానికి రూ.5 లక్షలు ప్రమాద బీమా మంజూరు చేసింది. ఆ చెక్కులను స్థానిక ఎద్దులపల్లి రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే అందజేశారు.

క్రైం న్యూస్..

రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి

తాడిపత్రి, నవంబరు16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కలూరు సమీపంలో కరెంట్ ఆఫీసు దగ్గర శనివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ కూలి మరణించాడు. గుమ్మగుట్ట మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన లక్ష్మినాయక్, హేమావతిబాయ్ కుమారుడు వరప్రసాద్ (28) కొద్దిరోజుల క్రితం జీవనోపాధి కోసం తాడిపత్రికి వలసవచ్చాడు. పరిశ్రమల్లో కూలి పనులు చేసేవాడు. శనివారం రాత్రి చుక్కలూరురోడ్డు సమీపంలో నడుచుకుంటూ వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆటోడ్రైవర్‌కు తీవ్రగాయాలు

గుత్తి రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసురాళ్లపల్లి గ్రామ శివారులోని 67వ జాతీయ రహదారిపై ఆదివారం ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గుత్తి మున్సిపాలిటీ పరిధి చెర్నేపల్లికి చెందిన ఆటో డ్రైవర్ ఓబులేసు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురంకి తరలించారు.

రైల్వే ఉద్యోగి ఇంట్లో చోరీ

గుంతకల్లుటౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే ఆసుపత్రి వద్ద రైల్వే క్వార్టర్స్‌లో నివాసముంటున్న ఇంట్లో శనివారం చోరీ జరిగింది. ఉదయం లింగన్న ఇంటికి తాళం వేసి డ్యూటీకి వెళ్లా డు. అత్యవసర ఫైల్ కోసం ఉదయం 11 గంటలకు ఇంటికి రాగా.. ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించి.. లోనికి వెళ్లి గమనించాడు. బీరువాలోని మూడు తులాల బంగారు ఆభరణాలు, రెండు కేజీల వెండి వస్తువులు, రూ. 30వేలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి..వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలో చోరీ దృశ్యాలు రికార్డు అయ్యాయి. కేసు దర్యాప్తులో ఉంది.

వ్యాన్ బోల్తా



పడిపోయిన వ్యాన్

యాడికి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువు వద్ద జాతీయ రహదారిపై వ్యాన్ ఆదివారం అదుపు తప్పి.. కారు ఢీకొని.. బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు బాగా దెబ్బతింది. కారులో బెలూన్లు ఓపెన్ కావడంతో అందులో ప్రయాణిస్తున్న గుంతకల్లుకు చెందిన దంపతులు సురక్షితంగా బయటపడ్డారు. యాడికి పోలీసులు బోల్తాపడ్డ వ్యాన్‌ను పక్కకు తొలగించి.. వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు.

పశు సంవర్ధక శిక్షణ కేంద్రంలో అగ్నిప్రమాదం

గుంతకల్లుటౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డులోని పశు వైద్యశాల ఆవరణంలో ప్రాంతీయ పశుసంవర్ధక శిక్షణ కేంద్రంలో ఆదివారం ఉదయం 8 గంటలకు అగ్నిప్రమాదం జరిగింది. స్థానికులు గుర్తించి అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందించారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగింది. దాదాపు రూ. 8 లక్షల నష్టం జరిగినట్లు ఏడీ నాగమల్లేశ్వరరావు తెలిపారు.

మద్యం సీజ్

యాడికి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోగాలకట్ట గ్రామంలోని ఓ బెల్ట్‌షాపులో నిల్వ ఉంచిన 28 క్వార్టర్ మద్యం బాటిళ్లను ఆదివారం సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆ షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేశామన్నారు.

వీధికుక్కల దాడిలో 16 గొర్రెలు మృతి

పెద్దపప్పూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మలదిన్నె గ్రామానికి చెందిన పుల్లయ్య గొర్రెలు మేపుకొని జీవనం సాగించేవాడు. శనివారం రాత్రి గొర్రెలను తమ దొడ్డిలో వదిలేసి ఇంటికి వెళ్లాడు. వీధికుక్కలు దాడిచేసి 16 గొర్రెలను చంపి తినేశాయి. ఆదివారం ఈ విషయాన్ని పుల్లయ్య గుర్తించాడు. తనకు రూ.3లక్షల వరకు నష్టం వాటిల్లిందని, అప్పు చేసి వాటిని కొనుగోలు చేశానని వాపోయాడు.

ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం



బహుమతులు అందజేస్తున్న నాయకులు, అధ్యాపకులు

గుంతకల్లుటౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీయూడబ్ల్యూజే కార్యాలయంలో జాతీయ పత్రికా దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి ఆయూబ్, ఉపాధ్యాయుడు ఇక్బాల్, మాజీ జర్నలిస్ట్ తారకేశ్వర్, ఎస్కేపీ డిగ్రీ కళాశాల అధ్యాపకులు నారాయణ, గోపినాయక్, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ యాదవ్ హాజరయ్యారు. రాజ్యాంగ పరిరక్షణలో మీడియా పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేత విద్యార్థినులు ఆర్తిసాయికృప, ఎం పూజితకు బహుమతులు, ఎన్ మానస, విరోజితకు ప్రోత్సాహ బహుమతులను అందజేశారు. ఇందులో ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షుడు జీఎం రఫీ, పట్టణ కార్యదర్శి వెంకటరాముడు, సభ్యులు హరగోపాల్‌రావు, కళ్యాన్‌కారి రమేష్‌బాబు, శివారెడ్డి, బాబురావు, చిన్న, శశి పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం కార్యవర్గం ఏకగ్రీవం

గుత్తి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక అచ్యుత ఆశ్రమంలో ఆదివారం కార్తీక వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పట్టణ బ్రాహ్మణ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కరణం రాజశేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా రాఘవేంద్రప్రసాద్, గౌరవ అధ్యక్షుడిగా మఠం శ్రీధర్, కోశాధికారిగా శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు సంజీవ్, వెంకట్రాది, కొప్పుల శ్రీనివాసులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు రాజేంద్ర, శివయ్య, దేశాయ్‌నాగరాజు పాల్గొన్నారు.